స్వశక్తిగా నారీమణి..

- మహిళలకు స్వయం ఉపాధి ప్రోత్సాహం
- జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ
- అనంతరం సర్టిఫికెట్, ఎస్‌బీఐ రుణ సౌకర్యం

మరిపెడ రూరల్: నేటి సమాజంలో మహిళలు ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తిగా ఎదగాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. ఈక్రమంలోనే మహిళలు ఉపాధి మార్గాలను ఎంచుకొని రాణిస్తున్న రంగాలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా పలు స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలు కూడా వారికి ప్రోత్సహించి మహిళలు ఎవరి కాళ్ల మీద వారే నిలబడేలా ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ) సంస్థ ఓ మండల కేంద్రాన్ని పరిగణంలోకి తీసుకుని ఉత్సాహవంతులైన మహిళలను ఎంపిక చేస్తున్నారు. వారికి వివిధ రకాల జనపనార సంచులు (జ్యూట్ బ్యాగ్స్) తయారీకి శిక్షణ ఇస్తున్నారు. 13రోజుల శిక్షణ అనంతరం ప్రావీణ్యతతో కూడిన సర్టిఫికెట్, టూల్ కిట్, ఆర్థికంగా అవసరం ఉన్న వారికి ఎస్‌బీఐ రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

ఎంపిక విధానం..

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో వందరోజులు పూర్తి చేసుకున్న మహిళలు అయి ఉండాలి. చదువుకుని ఆసక్తిగల మహిళలను పలు గ్రామాల నుంచి ఎంపిక చేస్తారు. సుమారు 35 మంది శిక్షణకు అవసరం ఉండగా ఎంపిక చేశారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో ఈ శిక్షణ ప్రధాన కార్యాలయం ఉంది. అక్కడి నుంచి ప్రత్యేక ట్రైనర్స్ వచ్చి వీరికి శిక్షణ ఇస్తారు.


శిక్షణ పొందుతున్న మహిళలు

13రోజులపాటు శిక్షణ

స్వయం ఉపాధికి ఎంపికైన 35మంది మహిళలకు మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో వారికి ప్రత్యేక ట్రైనర్ల ద్వారా 13రోజులు భోజనంతోపాటు శిక్షణ ఇస్తారు. వీరికి ట్రైనింగ్‌లో కూడా రోజుకు రూ.300 చొప్పున స్టైఫండ్ అందిస్తారు. వారు ఇంటి వద్దనే తయారు చేసిన బ్యాగ్స్ మార్కెట్ చేయడానికి సహకారం కల్పించడంతోపాటు పలు సూచనలు, సలహాలు ఇస్తారు. జ్యూట్ బ్యాగులకు ఉన్న డిమాండ్ ఆధారంగా నెలకు రూ.20నుంచి 25వేల వరకు ఆదాయం సమకూర్చుకోవచ్చు. తద్వారా మహిళలు ఆర్థికంగా బలపడవచ్చు.

18వేల మందికి శిక్షణ ఇచ్చాం..



వరంగల్ హసన్‌పర్తిలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఉంది. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 18వేల మంది మహిళలకు శిక్షణ ఇచ్చాం. వారిలో 15వేల మంది మహిళలు నేడు తమ సొంతంగా ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా మరిపెడలో 35 ఆసక్తి గల మహిళలకు మందికి శిక్షణ ఇస్తున్నాం.

\- బి.లక్ష్మి, ప్రత్యేక శిక్షకురాలు

ఎవరిపై ఆధారపడొద్దు



ఎవరిపై ఆధార పడొద్దని, ఎవరి కాళ్లపై వారు నిలబడాలి. జనపనార బ్యాగుల తయారీ శిక్షణలో చేరాను. మరో వారంలో రోజుల్లో శిక్షణ పూర్తి అవుతుంది. స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆసరాగా ఉంటా.

\- మాతంగి స్వరాజ్యం, శిక్షణ మహిళ

క్లుప్తంగా

సిమెంట్ బెంచీల వితరణ



చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి గ్రామానికి చెందిన కంచనపల్లి ఉపేందర్–రజితకుమారి దంపతులు విస్సంపల్లి గ్రామంలో బస్టాండ్ ప్రాంగణంలో రూ.25వేల విలువైన సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. విద్యుత్ శాఖలో జనగాంలో డీఈగా పని చేస్తున్న ఉపేందర్ గ్రామాభివృద్ధి కోసం తన వంతు పూర్తి సహకారం అందించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పెద్దలు మంగపతిరావు, స్నేహితులు కాలునాయక్, దయానంద్, ఉపేందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో లింగన్న, రాజేష్, వెంకన్న, సుధాకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరి ఫయర్ అందజేత



కొత్తగూడ: పదో తరగతి వరకు విద్యా బుద్ధులు నేర్పిన పొగుళ్లపల్లి ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమవంతు సాయంగా వాటర్ ప్యూరి ఫయర్ ఆదివారం అందజేశారు. 2022–23 బ్యాచ్ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అంతా కలసి అందించడం అభినందనీయమని ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు అన్నారు.

ప్రత్యామ్నాయ తాగునీటి సౌకర్యం కల్పించాలి

గార్ల: గార్ల పట్టణంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయినప్పుడు, ప్రత్యామ్నాయంగా రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రజలకు తాగునీటి సరఫరా చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర నాయకుడు గిన్నారపు మురళి డిమాండ్ చేశాడు. ఆదివారం గార్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గార్ల సమీపంలోని పాకాల ఏటిపై గతంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం మోటార్లకు మరమ్మతులు చేపట్టి, మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిన సమయంలో ప్రత్యామ్నాయంగా మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా చేయాలని పంచాయతీ అధికారులను కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పెద్దవంగర: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. మండలంలోని కొరిపల్లి గ్రామంలో ఇటీవల ఎర్ర నీరజ (35) అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం సురేష్ కాంగ్రెస్ నాయకులతో కలసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంగు మురళీగౌడ్, మాజీ ఉప సర్పంచ్ వీరా రెడ్డి, స్థానికులు ఉపేందర్, యాదగిరి, నర్సయ్య, ఎండి జలాలుద్దీన్, నరేష్, మహేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


పట్టు వస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు: మండలంలోని నర్సింహులగూడెం గ్రామ పరిధిలోని కోరగుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మూడు రోజులుగా వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో వాడవాడలా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అయిలయ్య బండి గుట్టయ్య, పొన్నం నారాయణ, నాయకులు యాదవరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, రంజిత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.


ఆలయం వద్ద భక్తుల సందడి

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

మరిపెడ రూరల్: మృతుడు రవీందర్‌రెడ్డి కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని డోర్నకల్ మాజీ శాసన సభ్యుడు డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలం గుండెపుడి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొవ్వూరి రవీందర్‌రెడ్డి (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నవీన్, మహేందర్‌రెడ్డి, వెంకన్న, రాంబాబు, రవీందర్‌నాయక్ ఉన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి


మాట్లాడుతున్న మధు

మహబూబాబాద్ అర్బన్: ప్రైవేట్ పాఠశాల ఫీజుల నియంత్రణకు క్రమబద్ధమైన విధానాన్ని తీసుకువచ్చి అందరికి నాణ్యమైన విద్య అందుబాటులోకి ఉండేలా చూడడం లక్ష్యంగా పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఫీజుల నియంత్రణ చట్ట–ఆవశ్యకత అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు హాజరై మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి విద్యా సంవత్సరంలో 10శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచుతున్నాయన్నారు. ఎల్‌కేజీ ఫీజుల రూ.30నుంచి రూ.70వేల వరకు ఉన్నాయన్నారు. అధిక ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్య తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అలువాల వీరయ్య, రైతు సంఘం బాధ్యులు గునిగంటి రాజన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, కేజీకేఎస్ నాయకులు మోహన్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మధు, వీజేఎస్ కన్వీనర్ ఇరుగు మనోజ్ పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ నగర సంకీర్తన

మహబూబాబాద్ రూరల్: హనుమాన్ నగర సంకీర్తన, శోభాయాత్ర జిల్లా కేంద్రంలో ఆదివారం వైభవంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని పాతబజారు హనుమంతునిగడ్డ ఆంజనేయస్వామి దేవాలయం, మారుతి కుటీరం బాధ్యులు బొమ్మెర శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో అంజన్న ఆలయం నుంచి స్వాములు హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమం ప్రారంభించారు. బ్యాండు వాయిద్యాల మధ్య భక్తి శ్రద్ధలతో మహిళల కోలాట నృత్యాలు చేస్తూ, హనుమాన్ నామస్మరణతో హనుమాన్ నగర సంకీర్తన, శోభాయాత్ర జరిపారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు, అర్చకులు సందీప్ శర్మ, గురుస్వామి శ్రీనివాస్ పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న మాలధారులు

దుర్గంధంతో నరకయాతన


ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు


నాలుగో వీధిలో గుంతలో మురుగు నీరు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలోని సాయినగర్‌లో ఇళ్ల మధ్య మురుగు గుంతలతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. సాయినగర్ నాల్గో వీధిలో సైడు కాల్వలు లేకపోవడంతో పై ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి మురుగు నీరంతా పోటు వెంకట్రాములు ఇంటి పక్కకు చేరడంతో ఇళ్ల మధ్యలో పెద్ద మురుగు గుంతలు ఏర్పడ్డాయి. ప్రతీ రోజూ మురుగునీటి ప్రవాహం ఈ ప్రాంతంలోని గుంతలలో నిలవడం, పందులు, పశువులు, శునకాలు ఇక్కడ సేద తీరుతుండటంతో తీవ్ర దుర్గంధంతోపాటు దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను అనేకసార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వార్డు కౌన్సిలర్ పోటు జనార్దన్ తెలిపాడు. అధికారులు వెంటనే స్పందించి వీధిలో సైడు కాలువల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ఏర్పాట్ల పూర్తి


నర్సింహులపేట: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


కురవి: పోలింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల జాబితా అతికిస్తున్న సిబ్బంది


గార్ల: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది


దంతాలపల్లి: మండల కేంద్రంలో..


డోర్నకల్: జెడ్పీ హెచ్‌ఎస్ పోలింగ్ కేంద్రం వద్ద..

నర్సింహులపేట: మండలంలోని హైస్కూల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తైనట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం తెలిపారు. మండలంలో 1,177 పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 2,027 మంది పట్టభద్రులు ఉన్నారు.

కురవి: జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సుల్లో ఎన్నికల సామగ్రిని పోలీసుల బందోబస్తు నడుమ కురవి, సీరోలు జెడ్పీ హైస్కూల్‌కు తీసుకొచ్చారు.

గార్ల: మండలంలో 1,946 పట్టభద్రుల ఓట్లకు గాను గార్లలోని గర్ల్స్ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ అధికారి బాలరాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఆదివారం ఎన్నికల సిబ్బంది చేరుకుంది.

కొత్తగూడ: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి ఆదివారం ఎన్నికల అధికారులు చేరుకున్నారు. అధికారులకు కావాల్సిన వసతులను తహసీల్దార్ రమాదేవి పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండల వ్యాప్తంగా 541 మంది పట్టభద్రులు ఓటింగ్‌ను వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఖానాపురం: క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్, అయోధ్యనగర్‌ల్లో ఏర్పాటు చేసిన క్రీడల శిబిరాలను ఆదివారం ఆమె సందర్శించి మాట్లాడారు. అశోక్‌నగర్‌లో అథ్లెటిక్స్, అయోధ్యనగర్‌లో వాలీబాల్ క్రీడల శిబిరాలతో యువతకు మెరుగైన శిక్షణ లభిస్తుందని చెప్పారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పట్టుదలతో క్రీడల్లో రాణించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలని చెప్పారు. యువత శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ యాట రవికుమార్, శేఖర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఖానాపురం: మండలంలోని బుధరావుపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆలయ కమిటీ బాధ్యులు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, పగడాల రాంనర్సయ్య కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను ఆదివారం కలిసి కరపత్రాలను అందజేసి మాట్లాడారు. ఆలయంలో రెండు రోజులపాటు ఏకాదశ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో రామకృష్ణ విద్యాలయంలో..


డోర్నకల్: ఎంపీపీఎస్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని రామకృష్ణ విద్యాలయం 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోనగిరి ప్రసాద్, రోలకంటి ప్రకాష్‌రెడ్డి, ఈగ శ్రీనివాస్, నాగరాజు, రవి, నాగేశ్వర్‌రావు, యాద శ్రీనివాస్, సుబ్బమ్మ, భాగలక్ష్మి, విసీలారాణి, నిత, లలిత, అనురాధ, రాజకుమారి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మహేందర్, నాగేశ్వర్‌రావు, రాజేశ్వర్‌రావు, కనకయ్య పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక ఎంపీపీఎస్‌లో 1990–91 సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు 34 ఏళ్ల క్రితం విడిపోయిన మిత్రులంతా ఒక్కచోట కలవడంతో ఆనందంగా గడిపారు.


నెల్లికుదురు: చిన్ననాగారంలో..

నెల్లికుదురు: ఇనుగుర్తి మండంలోని చిన్ననాగారం ప్రభుత్వ పాఠశాల 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు పంజాల సత్తయ్యను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పోలోజు వెంకటేశ్వర్లు, వద్దిరాజ్ ప్రవీణ్‌కుమార్, వెంకన్న, ఉప్పలయ్య, పురుషోత్తంరెడ్డి, బైరు సత్యనారాయణ, అనిత, గీత, సునీత, భాగ్యమ్మ, సంధ్యరాణి పాల్గొన్నారు.

అన్నదానం

కేసముద్రం: గణపతి సచ్చినానంద స్వామిజీ జన్మదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో దత్త హ్యూమన్ సర్వీసెస్ వలంటీర్లు, దత్తభక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామిజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెలిశాల దయానంద్, ఉప్పుల ఏకాంతం, కొప్పుల శంకర్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఉప్పుల వంశీ, మోహన్, విజయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు జగ్గుతండా సమీపంలో వరంగల్–ఖమ్మం హైవేపై ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. దంతాలపల్లి నుంచి మరిపెడ వైపు ఆదివారం సాయంత్రం వెళ్తున్న ఆటో జగ్గుతండా సమీపంలో హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణం చేస్తున్న దంతాలపల్లికి చెందిన దర్శనాల రాములమ్మ, ఆటో డ్రైవర్ భూక్య బాష్‌సింగ్‌కు తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జోగ్యాతండాకు చెందిన చాందావత్ వీరన్న(48) కుటుంబ తగాదాల నేపథ్యంలో ఈనెల 21న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉండగా భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలుపట్టాలు దాటుతుండగా ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న బమ్మిపాటి సుధాకర్ రెడ్డి అనే 58 ఏళ్ల వయసు గల వ్యక్తి ఆదివారం సిగ్నల్ కాలనీ డంపింగ్ యార్డ్ ప్రాంతంలో రైలుపట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఆయనను ఢీకట్టింది. ఆయన పాదం తెగిపోయి తీవ్ర రక్తస్రావం జరగడంతోపాటుగా తలకు కూడా బలమైన గాయాలయ్యాయి. 108కు కాల్ చేయగా సిబ్బంది ఈఎంటీ ఉదయ్‌కుమార్, పైలట్ నెహ్రూ ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైలు ప్రయాణికుడికి అస్వస్థత

డోర్నకల్: తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఓ రైలు ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో డోర్నకల్ స్టేషన్‌లో ప్రయాణికుడిని రైలు నుంచి దింపి ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్ జిల్లా కోస్కి ప్రాంతానికి చెందిన సుంకరి బాబూరావు ఆదివారం తిరుపతి నుంచి నిజామాబాద్‌కు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా రైలు ఖమ్మం దాటిన తరువాత ఫిట్స్ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రైలు ప్రయాణికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది డోర్నకల్ రైల్వే స్టేషన్ చేరుకోగా అప్పటికే రైలు ప్లాట్‌ఫారం నుంచి కదిలింది. 108 సిబ్బంది రైల్వే అధికారులకు సమాచారం అందించగా రైలును స్టేషన్‌లోనే నిలిపి బాధితుడిని గుర్తించి వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

నర్సంపేట: ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి అన్ని రకాల పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు ఉచితంగా అందించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డారి రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో సదానందం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024లోనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని నమ్మించి రైతులను వంచించిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేలా సబ్సిడీలు రద్దు చేసిందని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక రైతుబంధు పథకాన్ని సర్వరోగ నివారిణిలా చూపించి రైతులను మోసం చేశారన్నారు. బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, జిల్లా కమిటీ సభ్యులు మైదం పాణి, లాల్ పాల్గొన్నారు.

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



గార్ల: పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీఏటా వర్షాకాలంలో మండల కేంద్రమైన గార్లకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాగం లోకేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ :
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646